క్లుప్తంగా

ప్రతిపక్షాల దుష్ప్రచారం తిప్పికొట్టాలి

- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



ఎస్సీ సెల్ నాయకులతో ఎమ్మెల్యే రవిశంకర్

బోయినపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ మండల ఎస్సీ సెల్ నాయకులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఎన్నికైన కాలం నుంచి స్థానిక బిడ్డగా నిరంతరం ప్రజల్లో ఉంటున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ఎన్నికలకు ముందు వచ్చి వెళ్లే నాయకులను ప్రజలు నమ్మొద్దని కోరారు. సమావేశంలో మండల ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

బీమా చెక్కులు అందజేత



చెక్కు అందజేస్తున్న రాజేశ్వర్‌రావు

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని నూకలమర్రి గ్రామానికి చెందిన గుగ్లోతు రేఖ, సరిపెల్లి సుందరవ్వకు మంజూరైన బీమా చెక్కులను కరీంనగర్ డెయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావు అందజేశారు. కరీంనగర్ డెయిరీ మిల్క్ కేంద్రంలో ఇద్దరు సభ్యుల భర్తలు మృతితో ఒక్కొక్కరికి రూ.5 లక్షల చెక్కును రాజేశ్వర్‌రావు అందజేశారు. వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రావు, గ్రామ పాల కేంద్రం చైర్మన్ గుగ్లోతు బలరాంనాయక్ ఉన్నారు.

కోనరావుపేటలో..

కోనరావుపేట: కోనరావుపేట మండలంలో వివిధ గ్రామాలకు చెందిన 32 మంది రైతులు మృతి చెందగా, ఒక్కో కుటుంబానికి రూ. 50 వేల చొప్పున రూ. 16 లక్షలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మిర్యాల ప్రభాకర్‌రావు అగ్రహారం బీసీ మేనేజర్ రవీందర్, అసిస్టెంట్ మేనేజర్ రాజిరెడ్డి, మల్కపేట బీసీ ఇన్‌చార్జి జవ్వాజి ఎల్లాగౌడ్ పాల్గొన్నారు.

లంక అటవీప్రాంతంలో కంచె మాయం

చందుర్తి: మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులోని లంక అటవీప్రాంతంలో అటవీ శాఖ అధికారుల ఏర్పాటు చేసిన కంచె(ఫెన్సింగ్)ను గుర్తు తెలియని వ్యక్తులు నెల రోజుల క్రితమే మాయం చేశారు. కాగా ఈ విషయం మంగళవారం గ్రామస్తులతో చర్చతో బయటకు పొక్కింది. కాగా ఈ వ్యవహారంపై గత నెలలో చందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసినా పోలీసులు ఈ విషయాన్ని బయటకు చెప్పలేదు. కంచె మాయమైన విషయంపై అటవీ శాఖ సిబ్బందిని వివరణ కోరగా గత 25న పోలీసులకు ఫిర్యాదు చేశామని, దొంగలెవరో బయట పడలేదని వారు పేర్కొన్నారు.

వాడవాడలా కొలువుదీరిన

గణనాథులు

సర్వ విఘ్నాలను తొలగించే ఏకదంతుని నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో వీధి, వీధిన వైభవంగా ప్రారంభమయ్యాయి. చిన్నా, పెద్దా తేడాలేకుండా అన్ని వర్గాల వారు సోమవారం వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. అందమైన మండపాల్లో గణేశుడు కొలువుదీరాడు. అందుకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. ఒక సిరిసిల్ల పట్టణంలోనే సుమారు 900 వరకు వినాయక మండపాలు వెలిశాయి. ఉదయం మొదలుకుని అర్ధరాత్రి వరకు వినాయక పూజలను నిర్వహించారు. వందల సంఖ్యలో భారీ వినాయకులను ప్రతిష్ఠించారు. ఐదడుగులు మొదలుకుని 18 అడుగుల ఎత్తు గల వినాయకులు ఆకర్షించాయి. ఈ సందర్భంగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం పూజా కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సోమవారం గీతానగర్, విద్యానగర్ అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన భారీ వినాయకుడికి మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ దంపతులు, చందుర్తిలో డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, మల్యాలలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ గణేశుని దర్శించుకున్నారు.

– సిరిసిల్లటౌన్/సిరిసిల్లకల్చరల్/తంగళ్లపల్లి/గంభీరావుపేట/వేములవాడఅర్బన్/బోయినపల్లి/కోనరావుపేట చందుర్తి/వీర్నపల్లి/ముస్తాబాద్/రుద్రంగి



సిరిసిల్ల గీతానగర్, విద్యానగర్ అభివృద్ధి కమిటి గణేశ్ మండప్



సిరిసిల్ల సిద్దార్థ కాలనీలో 26 ఫీట్ల అందరీచా రాజా గణేశ్ మండప్



గంభీరావుపేటలో..



ముస్తాబాద్‌లో..



వేములవాడఅర్బన్: గొల్లపల్లిలో..





చందుర్తిలో పూజలు చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీనివాస్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ

పల్లెప్రజలకు మెరుగైన వైద్యం ప్రభుత్వ ధ్యేయం

- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- పెద్దలింగాపూర్‌లో పీహెచ్‌సీ నిర్మాణానికి భూమిపూజ

ఇల్లంతకుంట: పల్లెప్రజల ముంగిట్లోకే సర్కారు వైద్యాన్ని తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలో రూ.1.56 కోట్ల వ్యయంతో నిర్మాణం చేయబోయే పీహెచ్‌సీ నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేసి మాట్లాడారు. ఇల్లంతకుంటలో రూ.17.50 కోట్ల వ్యయంతో 50 పడకల ఆస్పత్రి కూడా ఏర్పాటు చేయబోతున్నామన్నారు. మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని అన్నారు. ప్రజలు ప్రభుత్వానికి వారధిగా ఉన్నారన్నారు. అనంతరం కేశన్నపల్లి గ్రామానికి చెందిన చిట్యాల



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రసమయి

మల్లయ్య అనే వ్యక్తికి దళితబంధు పథకం ద్వారా డీజే సౌండ్ సిస్టమ్‌ను ఎమ్మెల్యే అందజేశారు. గొల్లపల్లి, వెంకట్రావుపల్లి గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, వైస్‌ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్, సర్పంచ్ గొడిసెల జితేందర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, ఏఎంసి చైర్మన్ మామిడి సంజీవ్ పాల్గొన్నారు.

కోరం లేక మండల సమావేశం వాయిదా

- అలక బూనిన ఎంపీటీసీలు
- ఐదుగురు మాత్రమే హాజరు

ముస్తాబాద్: ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. ఎంపీపీ పిల్లి రేణుక అధ్యక్షతన మంగళవారం సమావేశ మందిరంలో అధికారులు సమావేశానికి ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 12 గంటలైన ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు మాత్రమే హాజరయ్యారు. మిగతా సభ్యుల కోసం వేచిచూసిన వారు రాకపోవడంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ రేణుక, ఎంపీడీవో చిరంజీవి ప్రకటించారు. అయితే ప్రభుత్వ కార్యక్రమాలలో తమకు తగిన ప్రాధాన్యం, గుర్తింపు లభించడం లేదని భావించిన ఎంపీటీసీలు సమావేశానికి దూరంగా ఉన్నట్లు సమాచారం. గైర్హాజరు అయిన వారిలో అధికార పార్టీకి చెందిన సభ్యులే ఉండడం గమనార్హం. అల



సభ్యుల గైర్హాజరుతో ఖాళీగా ఉన్న కుర్చీలు

కబూనిన ఎంపీటీసీ సభ్యులతో బీఆర్ఎస్ పార్టీ నేతలు మాట్లాడినట్లు తెలిసింది. అయితే సమావేశానికి హాజరైన ఎంపీపీ రేణుక, జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, అధికారులు, సర్పంచులు గైర్హాజరైన వారితో మాట్లాడే ప్రయత్నం చేసిన వారు రాలేదని తెలిసింది. సమావేశాన్ని మరోరోజు నిర్వహిస్తామని ఎంపీడీవో ప్రకటించారు.

అనుమతులు లేని డీజేలపై కేసులు



డీజే నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై

ముస్తాబాద్: అనుమతులు లేకుండా డీజేలు పెడితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై శేఖర్‌రెడ్డి హెచ్చరించారు. ముస్తాబాద్ ఠాణాలో డీజే నిర్వాహకులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. పెండ్లిళ్లు, వినాయక నిమజ్జనం సమయంలో అనుమతులు లేకుండా డీజేలు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. డీజే సౌండ్‌తో విద్యార్థులు, హృద్రోగులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆరోగ్యరీత్యా డీజే సౌండ్ మంచిది కాదన్నారు. అనుమతులు పొందిన వారు మాత్రమే డీజేలు పెట్టాలని, గణేశ్ నిమజ్జనం రోజున నిబంధనలకు లోబడి కార్యక్రమాలను పూర్తిచేయాలని సూచించారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న షీ టీం అధికారి

గంభీరావుపేట: మండలంలోని దమ్మన్నపేట మోడల్ స్కూల్ విద్యార్థులకు మంగళవారం సైబర్ నేర నియంత్రణ చర్యలపై జిల్లా షీ టీం అధికారులు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు జరుగుతున్న తీరు, అప్రమత్తతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మహిళల భద్రతకు షీ టీం తీసుకుంటున్న చర్యల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీం అధికారి అంజయ్య, ప్రిన్సిపాల్ రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వల్లంపట్ల సర్పంచ్ భర్తపై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్లఅర్బన్: అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామ సర్పంచ్ భర్త వెంకట నర్సింహారెడ్డిపై చర్యలు తీసుకోవాలని గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు కలెక్టరేట్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచ్ భర్తనని అధికారం చెలాయిస్తూ, అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఉపసర్పంచ్, వార్డు సభ్యులు తీర్మానం లేకుండా అనర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించారని, ఇదేంటని ప్రశ్నిస్తే మీరు దిక్కున్న చోట చెప్పుకోండి అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నారన్నారు. గ్రామ పంచాయతీ నిధులు, ఖర్చుల గురించి అడిగితే బెదిరింపులకు



కలెక్టరేట్ వద్ద వల్లంపట్ల ఉపసర్పంచ్, ప్రజలు

పాల్పడుతున్నారన్నారు. తమ ప్రమేయం లేకుండా డబుల్ బెడ్రూం ఇళ్లు ఎలా ఎంపిక చేశారో విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడుతున్న సర్పంచ్ భర్తపై చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ ఉపసర్పంచ్ కుర్ర శ్రీకాంత్ పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ కోసం ప్రత్యేక పూజలు

వీర్నపల్లి: మండల కేంద్రంలో దాసంజనేయస్వామి ఆలయంలో రెవెన్యూ డివిజన్ సాధన సమితి కన్వీనర్ ఒగ్గు బాలరాజు యాదవ్ అధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండలంలోని ఎర్రగడ్డ తండా గిరిజన ప్రజలు ఎల్లారెడ్డిపేటను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని ఏకగ్రీవం తీర్మానం చేశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాలను కలిపి రెవెన్యూ డివిజన్ ప్రకటించాలని అన్నారు. రెవెన్యూ డివిజన్ విశిష్టతను తండా వాసులకు వివరించారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న నాయకులు

ఈ కార్యక్రమంలో మాందటి లక్ష్మణ్, పిరునాయక్, మల్లేశం, కాంతయ్య, రాకేశ్ ,శ్రీనివాస్ తో పాటు ఎర్రగడ్డ తండా ప్రజలు పాల్గొన్నారు.

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం

సిరిసిల్లటౌన్/వేములవాడఅర్బన్: జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులను నియమించినట్లు డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ మంగళవారం ప్రకటించారు. సిరిసిల్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఇప్పటివరకు బాధ్యతలు నిర్వర్తిస్తున్న సూర దేవరాజును తిరిగి నియమించారు. ఉపాధ్యక్షుడిగా దొమ్మాటి నర్సయ్య, వేములవాడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, ఉపాధ్యక్షుడు ఎండీ అజీమ్‌లు నియమితులైనట్లు వెల్లడించారు. పార్టీ అధినేత్రి సోనియా గాంధీ, ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉత్తర్వులు చేపట్టినట్లు పేర్కొన్నారు.



సూర దేవరాజు



వెంకటస్వామి

నకిలీ రశీదులపై విచారణ

ముస్తాబాద్: ముస్తాబాద్ మేజర్ పంచాయతీలో నకిలీ రశీదు బుక్కుల వినియోగం, ఇండ్ల పర్మిషన్ల విషయంలో వచ్చిన అవినీతి ఆరోపణలపై ఎంపీవో ఆరిఫ్ మంగళవారం కార్యాలయంలో విచారణ చేపట్టారు. పంచాయతీలో 15వేల సిరీస్‌తో రశీదు బుక్కుల వినియోగం జరుగుతుండగా.. గత ఫిబ్రవరి 1 నుంచి వినియోగిస్తున్న రెండు రశీదు బుక్కులపై సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు అనుమానాలు వచ్చాయి. ఎంపీవో అనుమతులు లేకుండా రశీదు బుక్కుల విషయంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో ఎంపీవో, ఇన్‌చార్జి ఈవో శ్రీనివాస్ రికార్డులను పరిశీలించారు. సెలవులో ఉన్న పంచాయతీ కార్యదర్శి రాజు చేతిరాత పూర్వకంగా వివరణ తీసుకున్నారు. అలాగే సిబ్బంది, గతంలో పన్నులు చెల్లించిన వారి వివరాలను నమోదు చేసుకున్నారు. రెండు బుక్కుల ప్రింటింగ్,



విచారణ జరుపుతున్న ఎంపీవో

ఇతర అంశాల్లో అధికారుల ప్రమేయం ఎంత వరకు ఉందో తెలియనుందని భావిస్తున్నారు. విచారణలో తేలిన అంశాలపై జిల్లా అధికారులకు త్వరలో నివేదిక ఇవ్వనున్నట్లు ఎంపీవో పేర్కొన్నారు. పంచాయతీలో జరిగిన ఇతర లావాదేవిల రికార్డులను పరిశీలిస్తామన్నారు. తమకు ఎలాంటి సమాచారం లేకుండా రశీదు బుక్కులు వినియోగిస్తున్నారని సర్పంచ్ సుమతి తెలిపారు. అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్, వార్డు సభ్యులు బుర్ర రాములు, పల్లె సత్యం అధికారులను కోరారు.

డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



దుబాయ్‌లో కేక్ కట్ చేస్తున్న కార్మికులు

చందుర్తి/కోనరావుపేట: డీసీసీ అధ్యక్షుడి ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. చందుర్తి మండలం సనుగుల శ్రీ గోవిందరాజు స్వామి సన్నిధిలో, కోనరావుపేట మండలంలోని వివిధ గ్రామాల్లో, దుబాయ్‌లోని గల్ఫ్ కార్మికుల అవగాహన కేంద్రం సభ్యుల ఆధ్వర్యంలో /కేక్ కట్ చేసి స్వీట్లను పంచుకున్నారు. గల్ఫ్ కార్మికుల అవగాహన కేంద్రం అధ్యక్షుడు కటకం రవి, గల్ఫ్ కార్మికులు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, మర్రిగడ్డ సర్పంచ్ జలపతి, సనుగుల సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ముకుందరెడ్డి, మాజీ ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్‌లో చేరారు.

సంక్షిప్త వార్తలు

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



కోనరావుపేట: ప్రధాని మోదీ మహిళలకు మంచి గుర్తింపు ఇచ్చారని సింగిల్‌విండో డైరెక్టర్ గొట్టె మహేశ్వరి అన్నారు. లోక్‌సభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించినందుకు కోనరావుపేటలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు రిజర్వేషన్ కల్పించిన ప్రధానికి మహిళా లోకం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

పుస్తెమెట్టెలు వితరణ

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన నిరుపేద ఆడబిడ్డ దంతె శృతి వివాహానికి జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు సోమవారం వధువుకు పుస్తెమెట్టెలు అందజేశారు.

వంతెన నిర్మాణ పనులు ప్రారంభమెప్పుడో?

వీర్నపల్లి: మండలంలోని అడవిపదిర గ్రామానికి వెళ్లే దారిలో వాగుపై వంతెన నిర్మాణ పనులు కోసం భూమిపూజ చేసి దాదాపు ఐదు నెలలు గడుస్తున్నా వంతెన నిర్మాణ పనులు ప్రారంభించలేదని, వెంటనే మొదలుపెట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జూలపెల్లి మనోజ్‌కుమార్ డిమాండ్ చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లికి చెందిన జింక అనసూయకు రూ.44,500 సీఎంఆర్ఎఫ్ చెక్కును బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గొల్లపల్లి రాజు మంగళవారం అందజేశారు.

బోరు మోటారు ప్రారంభం

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని గౌడ సంఘం ఆవరణలో రూ.1.50 లక్షల మండల పరిషత్ నిధులతో ఏర్పాటు చేసిన బోరు మోటారును సోమవారం ఎంపీపీ మానస ప్రారంభించారు.

సీనియార్టీ జాబితాలో చేర్చండి

సిరిసిల్లకల్చరల్: జూనియర్ అసిస్టెంట్‌లు నియమితులైన విలేజ్ రెవెన్యూ ఉద్యోగులను సీనియార్టీ జాబితాల్లో చేర్చాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖలో నియమితులైన వీఆర్‌వోలు చంద్రమోహన్, స్వప్న, నవీన్, తిరుపతి, నరేశ్, ప్రకాశ్ డీఐఈవో మోహన్‌కు విజ్ఞాపన పత్రం అందజేశారు.

యాదవ కమ్యూనిటీ హాల్‌లో నీటి సౌకర్యం

ముస్తాబాద్: మండలంలోని చిప్పలపల్లిలో యాదవ, కురుమ కమ్యూనిటీ హాల్‌లో మండల పరిషత్ నిధుల నుంచి బోరుమోటారు మంజూరు చేసినట్లు ఎంపీటీసీ పడిగెల సవిత తెలిపారు సర్పంచ్ జ్యోతి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

ముస్తాబాద్: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న దొడ్ల సంజీవ్‌ను పద్మశాలీ సేవా సంఘం మంగళవారం ఘనంగా సన్మానించింది. పద్మశాలీ సంఘం అధ్యక్షుడు వనం బొందయ్య, మహేశ్, దూస శ్రీను, మాదాసు నాగరాజు పాల్గొన్నారు.

రజకుల సంక్షేమానికి కృషి

సిరిసిల్లఅర్బన్: రజకుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట రజక సంఘం నాయకుల సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుండు శ్రీనివాస్, జిల్లా యూత్ అధ్యక్షుడు వోద్నాల విక్రమ్, బండి మల్లేశం, మారుపాక శ్రీనివాస్, కాసర్ల వెంకటేశ్, తదితరులు ఉన్నారు.

సమాచారం

డిగ్రీ ప్రవేశాలకు స్పెషల్ డ్రైవ్

వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ప్రథమ సంవత్సరం వివిధ కోర్సుల్లో మిగిలిన ఖాళీల భర్తీకి ప్రవేశాల కోసం స్పెషల్ దోస్త్ 2023 నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 21 నుంచి 24 వరకు దోస్త్ వెబ్‌సైట్ ద్వారా అన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. 25 వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని, 29 నాడు సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. 30న సీట్లు పొందిన వారు కళాశాలలోరిపోర్ట్ చేసుకోవాలన్నారు.

నేడు మండల సమావేశం

కోనరావుపేట: మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. ఎంపీపీ చంద్రయ్య అధ్యక్షతన నిర్వహించే సభకు సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

టీపీటీడీసీ చైర్మన్ 'గూడూరి'కి సన్మానం



సిరిసిల్ల: తెలంగాణ పవర్‌లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీపీటీడీసీ) చైర్మన్ గూడూరి ప్రవీణ్‌ను మంగళవారం సిరిసిల్లలోని ఆయన ఇంట్లో బీఆర్ఎస్ నాయకులు, వస్త్రోత్పత్తిదారులు సన్మానించారు. చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ఏడాది అయిన సందర్భంగా శాలువాతో సత్కరించి, స్వీట్ తినిపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మండల సత్యం, యెల్దండి దేవదాస్, ఉపాధ్యక్షులు బూట్ల నవీన్‌కుమార్, వస్త్రోత్పత్తిదారులు గోవింద్ రవి, ఆడెపు భాస్కర్, మోర రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫార్వర్డ్ బ్లాక్‌లో చేరిన బీజేపీ నాయకులు



పార్టీలో చేరిన వారితో కట్కం మృత్యుంజయం

సిరిసిల్లఅర్బన్: రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన పలువురు బీజేపీ నాయకులు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో మంగళవారం హైదరాబాద్‌లో చేరారు. ఏఐఎఫ్‌బి నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కట్కం మృత్యుంజయం ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మేకల కమలాకర్, వరిబాబు, వడ్లూరి చందు, ఎనుగలు వినయ్, లక్ష్మినారాయణగౌడ్, వెంకటి, శంక్, ప్రకాశ్‌గౌడ్, అల్లెపు రమేశ్, రాజ్‌కుమార్, వేణు, శ్రీకాంత్, శంకర్, వంశీ, సుధాకర్, లక్ష్మణ్, బాబు చేరినట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

ఇల్లంతకుంట: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని పొత్తూరు గ్రామంలో డ్రై డే, జ్వర సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, టైర్లు, కులాయిలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి శ్రీరాములు, వైద్యాధికారులు రమేశ్, శరణ్య పాల్గొన్నారు.